మర్యాదపూర్వక కలయిక



మాజీ సీఎం కేసీఆర్‌తో మంద సంజీవ్‌రెడ్డి

బోడుప్పల్: బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవ్‌రెడ్డి తన పుట్టినరోజు సందర్భంగా గురువారం మాజీ సీఎం కేసీఆర్‌ను ఎర్రవల్లి వ్యవసాయక్షేత్రంలోని వారి నివాసంలో కలిశారు. మేడ్చల్ నియోజకవర్గ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డిని కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో జరుగుతున్న రాజకీయ పరిణామాలను వారితో మంద చర్చించారు.

అక్రమ నిర్మాణం సీజ్ !



రామంతాపూర్: జీహెచ్‌ఎంసీ ఉప్పల్ సర్కిల్ పరిధిలోని రామంతాపూర్ డివిజన్ శారదా నగర్ కల్లు కంపౌండ్ వీధిలో అనుమతులకు విరుద్ధంగా నిర్మిస్తున్న బిల్డింగ్‌ను గురువారం ఉప్పల్ జీహెచ్‌ఎంసీ ఏసీపీ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో సీజ్ చేశారు. టీపీఎస్ తుల్జాసింగ్, సునీల్ తదితరులున్నారు.

కార్పొరేటర్ పర్యటన



అల్వాల్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ శాంతి

అల్వాల్: డివిజన్ సెయింట్ గాబ్రియేల్ స్కూల్ వద్ద కార్పొరేటర్ చింతల శాంతిశ్రీనివాస్‌రెడ్డి అధికారులతో కలిసి పర్యటించారు. వర్షాల కారణంగా స్కూల్ వద్ద నీరు నిలవడాన్ని ఆమె గుర్తించారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. డీఈ ప్రశాంతి, ఏఈ వరుణ్, రామారావు, యాదగిరి, సాజిద్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



తులసిరమణాచార్యులు

మల్కాజిగిరి: ఉస్మానియా యూనివర్సిటీ ఓరియంటల్ విభాగం నుంచి ప్రముఖ రచయిత తులసీరమణాచార్యులు డాక్టరేట్ అందుకున్నారు. మసన చెన్నప్ప రచనలపై డాక్టర్ చంద్రశేఖర్‌రావు పర్యవేక్షణలో పరిశోధన చేసిన ఆయన 'మసన చెన్నప్ప రచనల పరిశీలన' అనే సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. డాక్టరేట్‌తో బాధ్యత మరింత పెరిగిందన్నారు.


బీజేపీలో పలువురి చేరిక



రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచంద్రరావుతో స్థానిక నేతలు

అల్వాల్: ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్రరావు అన్నారు. గురువారం అల్వాల్‌కు చెందిన లోక్‌సత్తా పార్టీ సీనియర్ నాయకులు కె.శ్రీనివాస్‌వర్మ, తన అనుచరులతో కలిసి బీజేపీలో చేరగా.. ఆ పార్టీ అధ్యక్షుడు కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో దేశం ఎంతో అభివృద్ధి చెందుతుందని, రాష్ట్రంలో బీజేపీ బలోపేతానికి చేరికలను ప్రోత్సహించాలన్నారు. పవన్‌కుమార్, రవికుమార్, ప్రదీప్‌మీనన్, శ్రీకాంత్‌రెడ్డి, ఉషా, అంజలి, స్వాతి, కృష్ణకుమారి, సంతోషి, వేణుగోపాల్‌రెడ్డి, చందిల్, వరకుమార్, గిరిధర్ వర్మ, ప్రజీత్, శేఖర్, రాజేష్, ప్రశాంత్, కిరణ్ కుమార్, రవికుమార్, మహేష్, రెహ్మత్ తదితరులున్నారు.

అమ్మవారి మండపం ఏర్పాటుకు కర్రపూజ



మల్లాపూర్: ఓల్డ్ మల్లాపూర్ శాంతి యూత్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారి మండపం ఏర్పాటుకు గురువారం కర్రపూజ నిర్వహించారు. ప్రతి ఏడాదిలాగే ఈసారి కుడా ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు క్లబ్ ప్రతినిధులు ప్రకటించారు. శాంతి యూత్‌క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ట్రా'ఫికర్' !

సిగ్నల్స్ లేకపోవడంతో తరచూ ప్రమాదాలు | తీవ్ర ఇబ్బంది పడుతున్న వాహనదారులు



సాయినగర్ చౌరస్తాలో వాహనాలు ఇలా..

గౌతంనగర్: డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. గత కొంతకాలంగా సఫిల్‌గూడ రైల్వేగేటును పూర్తిగా మూసివేయడంతో అటు సికింద్రాబాద్ ఏవోసీ మీదుగా వచ్చే వాహనాలు, ఇటు మల్కాజిగిరి నుండి వచ్చే వాహనాలతో ఉత్తమ్‌నగర్ చౌరస్తా, సాయినగర్ చౌరస్తా, మిర్జాలగూడ చౌరస్తాలో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. మల్కాజిగిరి, వినాయక్‌నగర్, ఆనంద్‌బాగ్ నుంచి వచ్చే వాహనాలు సికింద్రాబాద్ వరకు పలు ప్రాంతాలు చిరకాలంగా రక్షణశాఖ, రైల్వే కార్యకలాపాలకు కేంద్ర బిందువులుగా నిలుస్తున్నాయి.

రక్షణశాఖ రహదారులే దిక్కు..

రక్షణశాఖకు చెందిన స్థావరాలు కంటోన్మెంట్ బోర్డు పరిధిలో కొనసాగుతున్నాయి. మల్కాజిగిరి ప్రాంతంలో జనావాసాలు పెరగడంతో రక్షణశాఖకు చెందిన కార్యాలయాలకు చేరే రహదారులే ఆయా కాలనీవాసుల అవసరాలను తీరుస్తున్నాయి. ఓ వైపు సఫీల్‌గూడ రైల్వేగేట్ మూసేయడంతో ఉత్తమ్‌నగర్‌లో గతంలో నిర్మించిన ఆర్‌యూబీ మీదుగా వాహనాల రాకపోకలు కొనసాగిస్తున్నాయి. రోజుకు సుమారు వేల సంఖ్యలో ఉత్తమ్‌నగర్ మీదుగా వాహనాల రాకపోకలు ఉంటున్నాయి. చిరువ్యాపారులు సైతం రోడ్డు పక్కన వ్యాపారాలు చేస్తుండంతో నిత్యం వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

సాయినగర్ చౌరస్తాలో...

మల్కాజిగిరి, ఆర్‌కేనగర్, వాణినగర్ మీదుగా సాయినగర్ చౌరస్తా నుంచి మిర్జాలగూడ, లాలాగూడ, సికింద్రాబాద్‌కు వెళ్లే వాహనదారులు సికింద్రాబాద్ నుంచి మల్కాజిగిరి వైపు వచ్చే వాహనదారుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. దీంతో సాయినగర్ చౌరస్తాలో ట్రాఫిక్‌జామ్‌తో వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు.

రోజూ ఇబ్బందులు పడుతున్నాం..



సాయినగర్, ఉత్తమ్‌నగర్, మిర్జాలగూడ చౌరస్తాలో ఉదయం, సాయంత్రం నిత్యం ట్రాఫిక్‌జామ్ అవుతోంది. అడ్డగోలుగా వాహనాలు ఎవరికి వారు దూసుకురావడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. నియంత్రించే సిగ్నల్స్, ట్రాఫిక్ పోలీసులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మూడు చౌరస్తాల్లో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేసి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి.

– వినయ్‌కుమార్, స్థానికుడు

ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేస్తాం



గౌతంనగర్ డివిజన్‌లోని సాయినగర్, ఉత్తమ్‌నగర్, మిర్జాలగూడ చౌరస్తాల్లో రద్దీ వేళల్లో వాహనాలను క్రమబద్ధీకరించేందుకు తగిన చర్యలు తీసుకుంటాం. చౌరస్తాల వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేస్తాం.

– నర్సింహ, మల్కాజిగిరి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి



గాంధీనగర్‌లో పర్యటిస్తున్న టీజీఎస్‌పీడీసీఎల్ చైర్మన్, ఎండీ ముషర్రఫ్ ఫారుఖీ అలీ

కుషాయిగూడ: విద్యుత్ సమస్యల పరిష్కారానికే బస్తీబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని టీజీఎస్‌పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషర్రఫ్ ఫారుఖీ అలీ అన్నారు. గురువారం బస్తీబాటలో భాగంగా ఆయన కాప్రా డివిజన్, గాంధీనగర్‌లో పర్యటించిన ఆయన స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా గాంధీనగర్‌లో విద్యుత్ తీగల స్థానంలో కేబుల్‌బెంచ్‌ల ఏర్పాటు, నూతన విద్యుత్ స్తంభాలు, ప్రమాదకరంగా ఉన్న 11 కేవీ తీగల సవరణ వంటి పలు సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గాంధీనగర్‌వాసుల సమస్యలకు సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. కంపెనీ డైరెక్టర్ ఆపరేషన్ నరసింహ, జోనల్ చీఫ్ ఇంజినీర్ కామేష్, హబ్సిగూడ సర్కిల్ ఎస్ఈ ప్రతిమషోమ్, సైనిక్‌పురి డీఈ అన్వర్‌పాషా, ఏడీఈ రాంమూర్తి, ఏఈ సత్యనారాయణ, శ్రీనివాస్, కాశీరాం, వెంకటేష్, శివకిరణ్, రవి, స్థానికులు మహేష్, సత్యనారాయణ, కుమార్, నరేందర్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పౌర అణుశక్తిలో మరో మైలురాయి



ప్రారంభిస్తున్న ఎస్‌బీ.చాఫ్లే, డాక్టర్ కోమల్‌కపూర్ తదితరులు

కుషాయిగూడ: నగరంలోని కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ (ఎన్‌ఎఫ్‌సీ) పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో 700 ఎండబ్ల్యూఈ ప్రెషరైజ్డ్ హెవీ వాటర్ రియాక్టర్ల కోసం 8వ సెట్ న్యూక్లియర్ స్టీమ్ జనరేటర్ ట్యూబ్‌లను తయారుచేసి పౌర అణుశక్తి కార్యక్రమాల్లో ఎన్‌ఎఫ్‌సీ మరో మైలురాయిని అధిగమించిందని, అటామిక్ ఎనర్జీ రెగ్యులేటరీ బోర్డు (ఏఈఆర్‌బీ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌బీ. చాఫ్లే అన్నారు. గురువారం ఎన్‌ఎఫ్‌సీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ డాక్టర్ కోమల్‌కపూర్, ఎల్‌అండ్‌టీ హోల్‌టైమ్ డైరెక్టర్ అండ్ మెంబర్ అనీల్‌విపరాట్‌తో కలిసి స్టీమ్ వాటర్ ట్యూబ్‌ల వాహనానికి జెండా ఊపి ప్రారంభించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో తయారు చేసిన ఈ ట్యూబ్‌ల సైకిల్ కాలం కేవలం 3 నెలలకు కుదించి రికార్డు సృష్టించామన్నారు. భారత పౌర అణుశక్తికి కావాల్సిన 47,500 ఎస్‌జీ ట్యూబ్‌ల కంటే ఎక్కువ ట్యూబ్‌లను సకాలంలో అందజేసిన ఘనత ఎన్‌ఎఫ్‌సీకి దక్కిందన్నారు. 2047 నాటికి 100 గిగావాట్స్ అణు విద్యుత్ సామర్థ్యాన్ని సాధించడంలో ఎన్‌ఎఫ్‌సీ కీలకపాత్ర పోషించనుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

తుప్పు పట్టినా స్పందించరా ?

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు




మల్లాపూర్ అంబేడ్కర్ విగ్రహం హైమాస్ట్ లైట్ స్తంభం

మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్ పరిధిలోని అంబేడ్కర్ విగ్రహం పక్కన హైమాస్ట్ లైట్ విద్యుత్ స్తంభం కిందిభాగం తుప్పు పట్టి ప్రమాదకరంగా మారింది. పలుసార్లు విద్యుత్ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. జనప్రియకు వెళ్లేదారిలో ఓ విద్యుత్ స్తంభానికి సపోర్ట్ ఇనుప విద్యుత్ స్తంభం కిందిభాగం తుప్పు పట్టి, ఎప్పుడు..? కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర ఉన్న ఈ స్తంభాన్ని తొలగించి కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

హనుమాన్‌నగర్‌లో..

మౌలాలి: డివిజన్ పరిధిలోని హనుమాన్‌నగర్‌లో శ్మశానవాటిక ముందున్న విద్యుత్‌స్తంభం ప్రమాదకరంగా మారింది. సీసీరోడ్డు నిర్మాణం పూర్తయినప్పటికీ రోడ్డుపై అడ్డుగా ఉన్న స్తంభాన్ని తొలగించలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకుని స్తంభాన్ని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

స్టార్మ్ వాటర్ పైపులైన్ రూట్ పరిశీలన



పైపులైన్ రూట్‌ను పరిశీలిస్తున్న అధికారులు

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వరదనీరు సాఫీగా వెళ్లేందుకు స్ట్రామ్‌వాటర్ డ్రైనేజీ నిర్మాణంలో భాగంగా గురువారం రూట్ మ్యాప్‌ను హెచ్‌ఎండీఏ వెంచర్ డీఈ, పీర్జాదిగూడ డీఈలతో కలిసి స్థానిక మాజీ కార్పొరేటర్ సుభాష్ నాయక్ ఆధ్వర్యంలో పరిశీలించారు. వరదనీరు సాఫీగా వెళ్లేందుకు పీర్జాదిగూడ రెండో డివిజన్ నుంచి 15వ డివిజన్ ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్ ముందు నుంచి పర్వతాపూర్ చెరువు వరకు స్ట్రామ్‌వాటర్ డ్రైనేజీని మూసీలో కలిపేలా పైపులైన్ రూట్‌మ్యాప్‌ను పరిశీలించారు. ముంపునకు గురౌతున్న ఈస్ట్ శ్రీసాయినగర్ కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

టెక్ మహీంద్ర ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ

కుషాయిగూడ: నిరుద్యోగ యువతీయువకులకు ఉచిత శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు టెక్ మహీంద్రా పౌండేషన్ ప్రతినిధి నాగరాజు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. క్యాడర్ టెక్ మహీంద్రా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అడ్వాన్స్ కంప్యూటర్ కోర్సుల్లో 4 నెలల పాటుగా ఉచిత శిక్షణను ఇచ్చి కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు వివరించారు. ఇంటర్మీడియట్, డిగ్రీ పాస్/ఫెయిల్ 18-27ఏళ్ల యువతీయువకులు ఈ శిక్షణకు అర్హులని, ఆసక్తిగలవారు ఈసీఐఎల్‌లోని టెక్ మహీంద్రా ఫౌండేషన్ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. ఇతర వివరాలకు 91000 56583.

సూపర్‌వైజర్లకు అందని రెమ్యూనరేషన్ !

బోడుప్పల్: నగర పాలకసంస్థ పరిధిలో 11 నెలల క్రితం చేపట్టిన కులగణన సమగ్ర సర్వే సూపర్ వైజర్లకు ఇస్తామన్న రెమ్యూనరేషన్ ఇప్పటి వరకు అందలేదు. రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా 45 రోజులపాటు ఈ సర్వేను నిర్వహించింది. దీనికి ప్రభుత్వ టీచర్లు, ఇతర విభాగాలకు చెందిన 32 మంది అధికారులను బోడుప్పల్‌లో సూపర్ వైజర్లుగా నియమించి వారితో సర్వే చేపట్టింది. 45 రోజుల పాటు నిర్వహించిన ఈ సర్వేకు ఒక్కొక్కరికి రూ.12 వేలు ఇస్తామని చెప్పారు. ఇప్పటి వరకు రెమ్యూనరేషన్ అందలేదు. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని కులగణన సమగ్ర సర్వేలో పాల్గొన్న సూపర్‌వైజర్లకు ఇస్తామన్న రెమ్యూనరేషన్‌ను వెంటనే అందజేయాలని కోరుతున్నారు.

వరద సమస్యపై అధికారుల ఆరా

అల్వాల్: కొకూర్ ఫార్చ్యూన్ ఎవెన్యూలో వర్షాకాలంలో వచ్చే వరదనీరు కాలనీ ప్రహరీ వద్ద నిలిచిపోవడంతో బయటకు వెళ్లే మార్గం లేకుండాపోతోంది. దీంతో వరద ఇళ్లలోకి వచ్చి చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యను స్థానిక కాంగ్రెస్ సీనియర్ నేత మల్లికార్జున్ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించి జీహెచ్‌ఎంసీ అధికారులతో చర్చించారు. గురువారం జీహెచ్‌ఎంసీ డీఈ రఘు కాలనీవాసులతో కలిసి పర్యటించారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాలనీవాసులు సయ్యద్ అస్లాం, ఖాదర్ హుస్సేన్, గౌతమ్‌రాయ్, రాజ్‌కిరణ్, అబ్దుల్‌సలాం, మన్మధన్‌నాయక్, సీతారాం, భాస్కర్, రామారావు, ప్రమోద్, శేషాద్రి, నారాయణరెడ్డి, సోమోజీ, శశిధర్, నరేంద్ర, శ్రీనివాస్‌రెడ్డి, మురళి పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించండి



జెడ్సీకి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ సునీత

మౌలాలి: డివిజన్ పరిధిలోని షఫీనగర్, జేబీఆర్ స్కూల్ మార్గం సంతోషమానగర్, డీమార్ట్ ఎదురు మార్గాల్లో రోడ్డు నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ గున్నాల సునీత గురువారం జోనల్ కమిషనర్ రవికిరణ్‌కు వినతి పత్రం అందజేశారు. ఆమె మాట్లాడుతూ.. మూడేళ్లుగా రోడ్లు అధ్వానంగా ఉన్నాయన్నారు. నిధుల మంజూరుకు జెడ్సీ సానుకూలంగా స్పందించారని తెలిపారు.

జిల్లా కేంద్ర ఆసుపత్రి అభివృద్ధికి చర్యలు

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి: మల్కాజిగిరిలోని జిల్లా కేంద్ర ఆసుపత్రి అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆసుపత్రి ఆవరణలో ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత సమావేశంలో ఉన్న సమస్యలు కొన్ని పరిష్కారమయ్యాయన్నారు. పేషెంట్స్ లిఫ్ట్ మరమ్మత్తులు, అదనపు వైద్య పరికరాల ఏర్పాటు, ఆపరేషన్ థియేటర్ మార్పులు, ఆర్‌ఓఆర్ ప్లాంట్, తెలంగాణ డయగ్నస్టిక్స్ ఏర్పాటు చేశామన్నారు. రోగుల తాకిడి ఎక్కువగా ఉందని అందుకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

కలెక్టర్ చొరవతో నిధుల మంజూరు..

ఇటీవల జిల్లా కలెక్టర్ పరిశీలించి తగిన నిధులు మంజూరు చేశారన్నారు. ఇదే ప్రాంగణంలో ప్రభుత్వ వైద్య కళాశాల కుత్బుల్లాపూర్ కూడా నిర్వహిస్తున్నందున వసతులు పెరగాల్సి ఉందన్నారు. బీపీ, షుగర్ తదితర దీర్ఘకాలిక వ్యాధులతో వచ్చే వారికి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు.

ప్రత్యేక సిబ్బంది నియామకం..

జిల్లా నుంచి సదరం సర్టిఫికెట్స్ కోసం చాలామంది ప్రజలు వస్తారని, వారి కోసం ప్రత్యేక సిబ్బందిని నియమించాలని చెప్పారు. లయన్స్ క్లబ్స్, స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఆసుపత్రిలో మౌలిక వసతులు కల్పిస్తామని స్పష్టం చేశారు. ఆర్డీవో శ్యామ్‌ప్రకాష్, మల్కాజిగిరి డీసీ జకియా సుల్తానా, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ గీత, సూపరింటెండెంట్లు డాక్టర్ సునీత, రాధ, ప్రిన్సిపాల్ మహాలక్ష్మి, ఏఓ డాక్టర్ సంగీత్‌కుమార్, ఆర్‌ఎంఓలు శివకిరణ్, పల్లవి పాల్గొన్నారు.

అధికారిక సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులా..?

ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ సమావేశంలో ప్రజాప్రతినిధులు, అధికారులు కాకుండా బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు పాల్గొనడం సరికాదని పలువురు వ్యతిరేకించారు. స్థానిక కార్పొరేటర్‌ను సైతం సమావేశానికి ఆహ్వానించలేదని ఆరోపించారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

రూ.17 లక్షలతో రోడ్డుకు మరమ్మతులు !



బురదమయమైన రోడ్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్ గీత ఏఈ సుధీర్

ఉప్పల్: హైకోర్టు కాలనీ నుంచి చెరువు కట్ట మీదుగా నాచారం హెచ్‌ఎంటీనగర్‌కు వెళ్లే రహదారికి రూ.17 లక్షలతో మరమ్మతులు చేపట్టాలని చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్ అన్నారు. గుంతలుపడి ఇబ్బందికరంగా ఉన్న రోడ్డును ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ ఏఈ సుధీర్‌తో కలిసి పరిశీలించారు. ఈ విషయాన్ని గతంలో కార్పొరేటర్, స్థానికులు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకురావడంతో స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. దీంతో రోడ్డు మరమ్మత్తులకు రూ.17 లక్షలు మంజూరు కావడంతో గురువారం కార్పొరేటర్‌తో సహా ఏఈ వచ్చి రోడ్డును పరిశీలించారు. సాధ్యమైనంత త్వరలో రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తామని ఏఈ తెలిపారు.

ఇంకుడు గుంతలకు ప్రాధాన్యమివ్వాలి



ఆర్‌కేనగర్ కాలనీలో ఇంకుడు గుంత ఏర్పాటును పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: నీటిని కాపాడుకోవాలంటే ప్రజలు ఇంకుడు గుంతల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇవ్వాలని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. ఆర్‌కేనగర్ కాలనీలో జీహెచ్‌ఎంసీ తరుపున ఏర్పాటు చేస్తున్న ఇంకుడు గుంతలను ఆయన పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి కాలనీల్లో భూగర్భ జలాలు తగ్గిపోకుండా ఇంకుడు గుంతలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రజలు కూడా వారి ఇంటి ముందు ఇంకుడు గుంతను ఏర్పాటు చేసుకోవడం వలన భూగర్భ జలాలు పెరగడానికి అవకాశం ఉంటుందన్నారు. అనంతరం సఫిల్‌గూడ నిమజ్జనఘాట్‌ను పరిశీలించి బతుకమ్మ పండుగ కోసం ఘాట్‌ను సిద్ధం చేయాలని సూచించారు. రమేష్, శ్రీనివాస్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యలు పరిష్కరించాలి



కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ సిటిజన్ కాలనీలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కాలనీ అసోసియేషన్ సభ్యులు గురువారం కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వీబీఆర్ గార్డెన్ నుంచి పంచశీల్ ఎన్‌క్లేవ్ వరకు హైటెన్షన్ రోడ్డులో సీసీరోడ్డుకు మరమ్మతులు, డ్రైనేజీ వ్యవస్థను మంజూరు చేయాలని, బాక్స్ డ్రెయిన్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. అనంతరం కాలనీ నూతన కమిటీ సభ్యులు కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్‌ను సత్కరించారు. కాలనీ అధ్యక్షుడు ప్రసన్నకుమార్, ఉపాధ్యక్షుడు బిక్షపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి నీలవేణి, జాయింట్ సెక్రటరీ ఎల్‌సీ.నోగ్యురో, కోశాధికారి విఘ్నేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

భూ వివాదంపై వాస్తవాలు వెలుగులోకి రావాలి

కార్పొరేటర్ మేకల సునీతారాముయాదవ్



సమావేశంలో కార్పొరేటర్ మేకల సునీతారాముయాదవ్

గౌతంనగర్: వివాదాస్పదంగా ఉన్న స్థలంలో రోడ్డు ఎలా వేస్తారని గౌతంనగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీతారాముయాదవ్ ప్రశ్నించారు. గురువారం గౌతంనగర్ డివిజన్ సాయినగర్‌లోని కార్పొరేటర్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. డివిజన్‌లోని అన్నపూర్ణ హౌసింగ్ కో–ఆపరేటివ్ సొసైటీలో ఇటీవల అధికారులు వెళ్లి దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న రోడ్డును పరిశీలించారు. రూ.50 లక్షలతో రోడ్డు నిర్మాణంతో పాటు మౌలిక వసతులు కల్పించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. రామాంజనేయనగర్, అన్నపూర్ణ హౌసింగ్ కో–ఆపరేటివ్ సొసైటీలో ఓ వ్యక్తి తమ స్థలం ఉందని, గతంలో కోర్టును ఆశ్రయించాడు. ప్రస్తుతం ఈ స్థల వివాదం కోర్టులో ఉంది. అయినప్పటికీ రోడ్డు ఎలా వేస్తారని ప్రశ్నించారు. ఒక వేళ రోడ్డు వేయాలనుకుంటే కోర్టును ఆశ్రయించిన వ్యక్తిని కూర్చోబెట్టి నష్టపరిహారం చెల్లించి రోడ్డు వేసుకుంటే ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. సొసైటీలో భూవివాదాలపై నిజానిజాలు వెలుగులోకి రావాలన్నారు. కేవలం రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగా కార్పొరేటర్, ఎమ్మెల్యేలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ నేతలు మేకల రాముయాదవ్, నర్సింగ్ రావు, బొడిద రాజేష్, వాసు, దేవి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సెల్ టవర్ ఏర్పాటు చేయొద్దని ఆందోళన



ఉప్పల్ పద్మావతి కాలనీలో ఆందోళన చేస్తున్న స్థానికులు

ఉప్పల్: డివిజన్ పద్మావతి కాలనీలో సెల్‌టవర్స్ ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ.. స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ టవర్‌ను ఏర్పాటు చేయనివ్వమన్నారు. దీంతో సెల్‌టవర్స్ ఏర్పాటు చేసే వారు పోలీసులతో ఘటనాస్థలానికి వచ్చినా స్థానికులు అడ్డుకున్నారు. దీంతో స్థానికంగా తీవ్ర గందరగోళ వాతావరణం నెలకొంది. కాలనీవాసులు లక్ష్మణ్, సంపత్, బిక్షపతి, వెంకన్నలు మాట్లాడుతూ.. ఈ విషయంపై రెండునెలల క్రితం ఉప్పల్ జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

ఇప్పటికే రెండు టవర్లు..

ఒకే చోట ఇప్పటికే రెండు పెద్ద టవర్లు ఉన్నాయని, తిరిగి ఇంకో టవర్ ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. కాలనీలో ఉన్న రెండు టవర్ల రేడియేషన్ వల్ల కాలనీలో దాదాపు నలుగురు వ్యక్తులు, ఇద్దరు చిన్నారులు కేన్సర్ బారిన పడి మృతిచెందారని ఆరోపించారు. అధికారులు అనుమతులిచ్చినా, కోర్టులను ఆశ్రయించినా ఇక్కడ మాత్రం టవర్‌ను అనుమతించేది లేదని స్పష్టం చేశారు. మొండిగా వ్యవహరిస్తే జీహెచ్‌ఎంసీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు.